క్లుప్తంగా

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ



కొత్తపాలెంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎంపీడీఓ బాబ్జిరాజు

మొగల్తూరు: ఎన్నికల కోడ్ కొనసాగుతోంది. జూన్ నెల పింఛన్లకు సంబంధించి మొగల్తూరు మండలంలోని 17 గ్రామాల్లో 3,265 మందికి శనివారం సాయంత్రానికి సుమారు 1,725 మందికి సొమ్ము అందించామని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు తెలిపారు. 7,534 మందికి వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేయాల్సి ఉందన్నారు. కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాల్లో పింఛన్ల పంపిణీనా ఆయన పర్యవేక్షించారు. మరో రెండు రోజుల పాటు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.

దోబూచులాడుతున్న వరుణుడు



మొగల్తూరులో ఉదయం మేఘావృతమైన ఆకాశం

మొగల్తూరు: గత కొద్ది రోజులుగా భానుడు తనప్రతాపం చూపడంతో అల్లాడిన ప్రజలు శనివారం వేకువ జాము నుంచి ఉదయం 10 గంటలు వరకు ఆకాశంలో మబ్బులు కమ్మేయడంతో వాతావరణం చల్లబడి ఊపిరి పీల్చుకున్నారు. రానున్న రెండు రోజుల పాటు అక్కడక్కడ తేలిక పాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో వర్షాలు పడితే వాతావరణం చల్లబడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించండి



నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వరలక్ష్మి

యలమంచిలి: ఈ నెల 4న భీమవరంలో నిర్వహించే ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీ నాయకులంతా సహకరించాలని తహసీల్దార్ చిక్కాల వరలక్ష్మి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆమె రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు రోజున ఉండే నిబంధనలను వివరించారు. జూన్ 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కోడ్ ముగిసే వరకు ర్యాలీలు, బాణసంచా కాల్పులకు అనుమతి లేదని చెప్పారు. నిబంధనలకు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.


ఆర్థిక పరిపుష్టి సాధించాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

నరసాపురం: మహిళలు ఆర్థికంగా తమకాళ్లపై తాము నిలబడే విధంగా తగిన కృషి చేయాలని భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి సూచించారు. మూడురోజులపాటు జరిగే ఐద్వా రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం శనివారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ సమాజం ఎంతో అభివృద్ధి చెందిదని చెప్పుకోవడమే తప్ప, మహిళలు ఇంకా పురుషులతో సమానంగా బతకలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఉన్నత చదువులు చదువుకుని, ఆర్థిక పరిపుష్టిని సాధించాలని సూచించారు. కార్యక్రమానికి ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అధ్యక్షత వహించగా, సావిత్రి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కాళ్ల: కాళ్లకూరు స్వయంభు వేంకటేశ్వరస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారి దేవస్థానంలో శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు హాజరై స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు. దాతలు, గ్రామస్తుల సహాయ సహకారాలతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ జయంతి

- సింధూర, లక్ష తమలపాకుల పూజలు
- స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుమంత్ర: హనుమాన్ జయంతిని పెనుమంత్ర మండలంలో భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెనుమంత్ర పల్లపువీధిలో శ్రీదాసాంజనేయస్వామివారికి, ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితులు చిట్టా సీతారామ జోగయ్య శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం సింధూరం, లక్షనాగవళి పత్ర పూజలు మహిళలచే సామూహికంగా నిర్వహించారు. సాయంత్రం పుంతలో ములసమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. పల్లపు వీధి యూత్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. రజక పేటలో అభయాంజనేయస్వామికి రజక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు చిట్టా రవిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు., ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన ఏర్పాటుచేస్తామని సంఘ సభ్యులు తెలిపారు. వెలగలవారిపాలెం అభయాంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. నత్తారామేశ్వరం రామలింగేశ్వరస్వామి, జుత్తిగ సోమేశ్వరస్వామివారి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.





పెనుమంత్ర : దాసాంజనేయస్వామికి రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం
నత్తారామేశ్వరంలో విశేష పూజలు అందుకున్న భక్తాంజనేయస్వామి



మొగల్తూరు : ఆంజనేయ స్వామి ఆలయంలో అరటి పండ్లతో పూజ చేస్తున్న అర్చకులు



పెనుగొండ: ఇలపర్రులో హనుమంతుని విగ్రహం వద్ద భక్తులు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పెనుగొండ: హనుమద్ జయంతి ఉత్సవాలను శనివారం పెనుగొండ, ఆచంట మండలాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండ, సిద్ధాంతం, వడలి, ములపర్రు, కొఠాలపర్రు, ఆచంట, వల్లూరు, కొడమంచిలి గ్రామాల్లో హనుమద్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇలపర్రులో ఆంజనేయస్వామికి పెద్దింటి రాంబాబు వేద మంత్రాలతో పాతపాటి సుబ్బరాజు, నాగమణి, పాతపాటి రామరాజు ఉష దంపతులు పంచామృతాభిషేకం, నాగవల్లి దల, గంధ సింధూర పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సిద్ధాంతం విజయగోపాల స్వామి ఉపాలయంలో ఆంజనేయస్వామి ఆలయం, పెనుగొండ బజారు రామాలయం, ఆచంట కాపుల పాలెం వద్ద, బాలం వారి పాలెంలోనూ వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు ఏర్పాటుచేశారు.

మొగల్తూరు మండలంలో..

మొగల్తూరు: హనుమాన్ జయంతిని మొగల్తూరు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు రామాచార్యులు, కిరణ్ ఆచార్యులు పంచామృతాభిషేకం, తమలపాకులు, సింధూరంతో సహస్రనామార్చన చేశారు. అరటి పండ్లతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పాల్గొని స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పేరుపాలెంలోని 54 అడుగుల అభయాంజనేయ స్వామి, ముత్యాలపల్లిలోని 36 అడుగుల ఆంజనేయ స్వామి, కాళీపట్నంలోని 24 అడుగుల ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రోడ్లపైకి పశువులను వదిలితే చర్యలు

నరసాపురం: రోడ్లపైకి పశువులను వదిలితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక మార్కెట్ ప్రాంతంలో పశువులు విచ్చలవిడిగా సంచరించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. యజమానులు తమ పశువులను కట్టడి చేసుకోవాలని మైక్ ప్రచారం చేశామన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్–1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజీఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్‌లో మెళుకువలు నేర్పించారు. ఈనెల 7వతేదీ వరకు శిబిరం కొనసాగుతుందని కుమారి తెలిపారు. మున్సిపల్ స్కూల్ హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, సుధీర్‌మోహన్, సూర్యంబాబు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలు



కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి పండ్లు అందించిన సుధాకరరావు

పాలకొల్లు అర్బన్: పేదలకు సాయం చేయడంలో నిజమైన ఆత్మ సంతృప్తి కలుగుతుందని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రిలో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆరుగురికి రూ.30వే లు ఖర్చు చేసి కంటి శస్త్ర చికిత్సలు చేయించారు. వారికి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, జవ్వాజి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామ పరిధిలోని కాపులకొడపలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి వారిని హనుమద్ జయంతిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేంగా అలంకరించారు. వెంకటేశ్వర స్వామివారి చెంతనే గధాదారుడైన హనుమంతుని ప్రతిమను ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారి సేవలో తరించారు. అర్చకుడు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల ఆర్థిక సహకారంతో అన్నసమారాధన ఏర్పాటుచేశారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం, వేములదీవి, ఎల్బీచర్ల, కొప్పర్రు, సీతారామపురం సౌత్, చిట్టవరం తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాల్లో హనుమద్ జయంతి వేడుకలు నిర్వహించారు. హనుమంతునికి ఇష్టమైన సింధూరం, తమళపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. యర్రంశెట్టివారిపాలెంలోని అభయాంజనేయస్వామివారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్‌పాలెం గ్రామంలో పెద్ద ఎత్తున బక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో యర్రంశెట్టి బాబులు, ఫణికర్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: గ్రామాల్లో హనుమద్ జయంతి ఉత్సవాలను శనివారం భక్రి శ్రద్ధలతో నిర్వహించారు. యలమంచిలి మంచినీటి చెరువుగట్టున ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామికి పండ రసాలతో పంచామృతాభిషేకం, తమలపాకులు, సింధూరంతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి గోపాలకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో జరిగిన ఈ పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మేడపాడు మంచినీటి చెరువుగట్టున ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు.



నరసాపురం రూరల్: వేములదీవి వెంకటేశ్వరస్వామి



నరసాపురం రూరల్: వైఎస్ పాలెంలో స్వామి దర్శనం



యలమంచిలి : చెరువుగట్టున ఉన్న భక్తాంజనేయస్వామి

జగనన్న ప్రమాణస్వీకారం ఖాయం



కర్రి వెంకట నారాయణరెడ్డి, ఎంపీపీ

పెనుమంత్ర: రాష్ట్రంలో అధికశాతం సీట్లు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుని విజేతగా జగనన్న మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని పెనుమంత్ర ఎంపీపీ, ఆచంట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కర్రి వెంకట నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన కార్యకర్తలు, అభిమానులకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 6వ తేదీ వరకు ఎన్నికల నిబంధనలు అమలులో ఉంటాయని, నాలుగో తేదీన కౌంటింగ్ పూర్తయ్యే వరకు పోలీసులకు, అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కవ్వింపు చర్యలకు లోనుకాకుండా సమన్వయంతో వ్యవహరించాలని, సంబరాలు, బాణసంచా కాల్పులు చేయవద్దని కార్యకర్తలకు సూచించారు. ఈనెల ఏడో తేదీ నుంచి కొత్త ప్రభుత్వం అనుమతితో శాంతియుతంగా సంబరాలు నిర్వహించుకొనేందుకు అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే ఏర్పాటు చేయడంతోపాటు, కేంద్రంలో కీలక పాత్ర పోషించే స్థాయికి మన ఎంపీ అభ్యర్థుల విజయం ఉంటుందని వెంకట నారాయణ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అప్పటి వరకు కార్యకర్తలు ఎటువంటి ఆర్భాటాలకు వెళ్లవద్దని ఆయన కోరారు.

గోప్యత, క్రమశిక్షణ పాటించాలి



స్వామి నాయుడు, రిటర్నింగ్ అధికారి

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల ఓట్లు కౌంటింగ్ కేంద్రాల్లో ప్రతి ఒక్కరూ గోప్యత, క్రమశిక్షణ పాటించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతి లేదన్నారు. లెక్కింపు ప్రారంభానికి ముందు ఆర్‌పీ సెక్షన్ 128లోని నిబంధనలు చదివి వివరిస్తామన్నారు. చట్టం 1951 రూల్ 54 ఎన్నికల నియమాలు, 1961 ప్రవర్తన, హాజరైన వారికి సమాచారం కోసం, వారి భాగస్వామ్యానికి సంబంధించి గోప్యత నిర్వహణకు పూర్తి వివరాలు అందిస్తామని తెలిపారు. కౌంటింగ్ వద్ద ఉన్న ప్రతి వ్యక్తీ చట్టం ప్రకారం నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆచంట నియోజకవర్గ కౌంటింగ్ భీమవరం బి సీతా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 4వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్స్‌కు బస్సులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. విష్ణు కళాశాల గేటు వరకు తీసుకొస్తారని తెలిపారు. కౌంటింగ్ సైపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్టు చెప్పారు. 1962 ప్రవర్తనా నియమావళిని అనుసరించి కౌంటింగ్ ఏజెంట్లను నియమిస్తామన్నారు. ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు సమర్పించిన తరువాత కౌంటింగ్ ఏజెంట్స్ డిక్లరేషన్‌పై రిటర్నింగ్ అధికారి ఎదుట సంతకం చేయాల్సుంటుందని తెలిపారు. ఒక్కో టేబుల్‌కు ఒక్కో ఏజెంటును మాత్రమే అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం మొత్తం తిరగడానికి అవకాశం లేదన్నారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద ఉన్న అభ్యర్థి వద్ద ఎలక్షన్ ఏజెంట్‌కు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. వరుసగా ఏర్పాటు చేసిన టేబుల్స్ పైన పోలింగ్ కేంద్రాల వివరాల పట్టికలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రాధాన్యత అనుగుణంగా సిట్టింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.

భోజనం రుచిగా, శుచిగా అందించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ–2 గంగాధర శర్మ

పాలకొల్లు అర్బన్: విద్యార్థులంతా బడిలోనే భోజనం చేసే విధంగా రుచిగా, శుచిగా తయారు చేయాలని ఎంఈఓ–2 ఆర్ఎస్‌వీఎస్ గంగాధరశర్మ సూచించారు. మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులందరికీ పోషకాహారాన్ని అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ నెరవేర్చాలన్నారు. మధ్యాహ్న వంటల వీడియోలను టీవీలో చూపించి అవగాహన కల్పించారు. గోరుముద్దకు సంబంధించి వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ అమ్మాజీ, కోఆర్డినేటర్ తోకల జనార్దన్, సీఆర్‌పీలు బి.రామకృష్ణ, టి.లింగేశ్వరరావు, పి.రాజేశ్వరి, కె.లత, టి.సుధీర్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సీఎస్ఎన్ కళాశాలలో ఘనంగా అచీవర్స్ డే

భీమవరం: పట్టణంలోని సీఎస్ఎన్ కళాశాలలో శనివారం అచీవర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జగదీశ్ మెరైన్స్ ఎక్స్‌పోర్ట్స్ ఎండీ తోట జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఉద్యోగాన్ని సాధించినపుడు తల్లిదండ్రులు ఆనందానికి అవధులుండవన్నారు. సీఎస్ఎన్ కళాశాలకు చెందిన 104 మంది విద్యార్థులు ఉద్యోగులకు ఎంపికై న సందర్భంగా అచీవర్స్ డే నిర్వహించి వారిని అభినందించడం ప్రశంసనీయమన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ చీడే సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు మంచి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ, కళాశాల కోశాధికారి వడుపు గోపీ, స్టార్టక్ కంపెనీ సీఈఓ వేణుగోపాల్, సలీం ఖాన్, నిర్మల, బొమ్మదేవర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి కల్యాణం

పోడూరు: మండలంలోని జిన్నూరు అభయగణేష్, అభయాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో హనుమద్ జయంతి వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలో భాగంగా సీతారామచంద్రస్వామి రథోత్సవం, ఊరేగింపు కోలాట భజన, భజన గీతాలతో ఘనంగా నిర్వహించారు. రథోత్సవంలో చిన్నారుల వేషధారణలు అలరించాయి. ఉదయం 10 గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండుగగా నిర్వహించారు. పాలకొల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ పెన్మెత్స వెంకట సత్య సూర్యనారాయణరాజు(డీటీడీసీ బాబు), ఆదిలక్ష్మి దంపతులు, ఆచంట వెంకటరమణ కృష్ణ, రామలక్ష్మి దంపతులు, అద్దేపల్లి శ్రీరామారావు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవం, పూజా కార్యక్రమాల్లో జిన్నూరు పరిసర గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, ప్రేమ్‌నిరంతర్ గురూజీ, ఆచంట వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ జక్కంశెట్టి అప్పాజీ, భూపతిరాజు చినసూరి తదితరులు పాల్గొన్నారు.



జిన్నూరులో సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం



రథోత్సవంలో పౌరాణిక వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉపాధి కూలీల వేతనాలను సత్వరమే చెల్లించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: ఉపాధి హామీ కూలీల వేతనాలు సత్వరమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు ఉపాధి హామీ వేతన బిల్లులు చెల్లించడంలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులు చేస్తున్నట్టు చెప్పారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి లక్షా 90 వేల వేతన దినాలు కల్పించగా, 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్, మే నెలల్లో తక్కువ సమయంలో లక్షా 2 వేల పనిదినాలు కల్పించారని తెలిపారు. మండలంలో రూ.2 కోట్ల 40 లక్షలు వేతన బకాయిలు చెల్లించగా, మరో రూ.40 లక్షలు సచివాలయాల ఆధునికీకరణకు నిధులు విడుదల చేశారని చెప్పారు. తొలుత వ్యవసాయ, డ్రెయిన్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖ, వివిధ శాఖల నుంచి అధికారులు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: హనుమద్ జయంతిని పురస్కరించుకుని శనివారం భీమవరం మండలంలోని పెదగరువులో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సహకారంతో శ్రీఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గ్రామస్తులకు శుభసూచకమన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు. శ్రీఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న వారిలో ఎంపీటీసీలు తిరుమాని తులసీరావు, కేతా నాగమణి, బొమ్మిడి కొండరాజు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పేరిచర్ల సత్యనారాయణమ్మ, శివరామరాజు, సాయిరాజు, భరత్, కలిదిండి వాసు, దాట్ల శ్రీనివాసరాజు, అల్లూరి సూరపరాజు, కూనపురాజు అప్పలరాజు, కలిదిండి రంగరాజు, కూనపు రాజు, బలరామరాజు, పెన్మెత్స వెంకటరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జయంతి ఉత్సవాలు

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆంజనేయ స్వామి నామ స్మరణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.